హైదరాబాద్‌లో ఎస్‌ఈఐ జీసీసీ సెంటర్

హైదరాబాద్, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ): ప్రముఖ టెక్నాలజీ సేవల సంస్థ ఎస్‌ఈఐ..హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్(జీసీసీ)ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో కంపెనీ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. వచ్చే మూడేండ్లలో అందుబాటులోకి రానున్న ఈ జీసీసీ సెంటర్.. ఇంజినీరింగ్, ఫైనాన్స్ విభాగాల్లో ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా రాష్ట్రాన్ని బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్(బీఎఫ్‌ఎస్‌ఐ) రంగాల్లో అత్యున్నత స్థానంలో నిలిపేందుకు దోహదం చేయనున్నదని మంత్రి ధీమా వ్యక్తంచేశారు.

ట్రూ గుడ్ నిధుల సేకరణ

హైదరాబాద్, అక్టోబర్ 15: రాష్ట్రానికి చెందిన మిల్లెట్‌తో స్నాక్స్ తయారు చేస్తున్న ట్రూ గుడ్ తాజాగా మరో 9 మిలియన్ డాలర్లు(రూ.75 కోట్లకు పైమాటే) నిధులను సమీకరించింది. ఓక్స్ అసెస్ మేనేజ్‌మెంట్ సేకరించిన నిధులను భవిష్యత్తు వ్యాపార విస్తరణ కోసం, డిస్ట్రిబ్యూషన్లను పెంచుకోవడానికి వినియోగించనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

ఉద్యోగులకు జోష్

వచ్చే ఏడాదీ జీతాల్లో 9.5% పెరుగుదల: సర్వే

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: ఈ ఏడాది లాగే వచ్చే ఏడాదీ దేశంలోని ఉద్యోగుల జీతాలు 9.5 శాతం పెరుగవచ్చని డబ్ల్యూటీడబ్ల్యూ తాజా సాలరీ బడ్జెట్ ప్లానింగ్ నివేదిక చెప్పున్నది. మంగళవారం విడుదలైన ఈ రిపోర్టులో ఇతర ఆసియా దేశాలతో పోల్చితే భారత్‌లోనే 2025లో కార్పొరేట్ కంపెనీల ఉద్యోగుల వేతనాలు ఎక్కువగా పెరిగే అవకాశాలున్నట్లు డబ్ల్యూటీడబ్ల్యూ పేర్కొన్నది. వియత్నాం 7.6 శాతం, ఇండోనేషియా 6.5 శాతం, ఫిలిప్పీన్స్ 5.6 శాతం, చైనా, థాయిలాండ్‌లలో 5 శాతం చొప్పున ఉద్యోగుల జీతాలు పెరుగవచ్చన్నది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య ప్రపంచవ్యాప్తంగా 168 దేశాల్లో జరిగిన ఈ సర్వేలో దాదాపు 32వేల కంపెనీలు తమ అభిప్రాయాలను పంచుకున్నాయి. భారత్ నుంచి 709 సంస్థలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా తమ ఉద్యోగులకు ఈ ఏడాది 9.5 శాతం జీతాలు పెంచామని, వచ్చే ఏడాది కూడా ఇదే స్థాయిలో హైక్ ఇస్తామని ప్రకటించాయి.

రీగల్ ఎడిషన్‌గా బాలెనో

- **గరిష్ఠ ధర రూ.9.83 లక్షలు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ..ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని నూతన ఫీచర్లతో రూపొందించిన బాలెనోను మార్కెట్‌కు పరిచయం చేసింది. ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో ఇప్పటికే కీలకపాత్ర పోషిస్తున్న బాలెనోను లిమిటెడ్ ఎడిషన్‌గా అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు రూ.6.66 లక్షల నుంచి రూ.9.83 లక్షల ధరల శ్రేణిలో లభించనున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ ప్రత్యేక ఎడిషన్‌లో నూతన గ్రిల్ అప్పర్ గార్నిష్, ఫాగ్ ల్యాంప్, నూతన సీట్ కవర్లు, తొమ్మిది ఇంచుల స్మార్ట్‌ప్లే ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రాం వంటి 40 అడ్వాన్స్‌డ్ స్మార్ట్ ఫీచర్స్‌తో తయారు చేసింది.

ఐదేండ్లలో 5 లక్షల ఉద్యోగాలు

టాటా గ్రూపు చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: రాబోయే ఐదేండ్లలో తయారీ రంగంలో టాటా గ్రూపు 5 లక్షల ఉద్యోగాలు సృష్టించబోతున్నదని టాటా గ్రూపు చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తెలిపారు. సెమీ కండక్టర్, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ, సంబంధిత రంగాల్లో ఈ ఉద్యోగాలు రానున్నాయన్నారు. ఇండియన్ ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ..తయారీ రంగంలో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా అభివృద్ధి చెందిన దేశంగా మారడం అంత సులువుకాదని చెప్పారు. వ్యాపార రంగం రూపాంతరం చెందుతున్నదని, దీనికి తగ్గట్టుగా టాటా గ్రూపు కూడా పెట్టుబడులను పెంచిందని, ముఖ్యంగా సెమికండక్టర్ల తయారీ, అసెంబ్లింగ్, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ, ఇందుకు సంబంధించిన రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ఆయన ప్రకటించారు. దీంతో వచ్చే ఐదేండ్లలో 5 లక్షల ఉద్యోగాలు కల్పించనున్నట్లు చెప్పారు. అస్సాంలో సెమికండక్టర్ ప్లాంట్‌తోపాటు ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీకోసం ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పబోతున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించి మరింత సమాచారం ఇవ్వడానికి నిరాకరించారు.

జియో మరో రెండు ఫీచర్ ఫోన్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: రిలయన్స్ జియో మరో రెండు ఫీచర్ ఫోన్లను మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. వీ2 సిరీస్‌లో భాగంగా మరో రెండు మాడళ్లను ప్రవేశపెట్టింది. జియో భారత్ వీ3, వీ4 పేరుతో విడుదల చేసిన ఈ ఫోన్ల ప్రారంభ ధర రూ.1,099గా నిర్ణయించింది. 1000 ఎంఏహెచ్ బ్యాటరీతో తయారైన ఈ రెండు ఫోన్ల మెమొరీని 128 జీబీకి పెంచుకునే అవకాశం ఉన్నది.

ఇక్కడే డాటా స్టోరేజ్ చేయాలి: ఆకాశ్

భారతీయులందరూ దేశీయంగానే తమ డాటాను స్టోరేజ్ చేయాలని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో ఆయన మాట్లాడుతూ..దేశీయ డాటా స్టోరేజ్ సంస్థలకు ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉన్నదని, ముఖ్యంగా విద్యుత్‌తో రాయితీ ఇస్తే దేశీయ కంపెనీలు ఇక్కడే ఏఐ ఆధారిత డాటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి ముందుకు రానున్నట్లు చెప్పారు.

మాదీ వికెట్‌కీపర్ల బతుకే..

మా విజయాలను మరిచి వైఫల్యాలనే ఎత్తిచూపుతారంతా

సెంట్రల్ బ్యాంకులను చూస్తున్న తీరుపై ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ ఆవేదన

ముంబై, అక్టోబర్ 15: 'క్రికెట్‌లో వికెట్‌కీపర్లు, ఫుట్‌బాల్‌లో గోల్‌కీపర్లు ఎలాగో సెంట్రల్ బ్యాంకులూ అంతే. వారు సాధించే విజయాలను ఎవరూ గుర్తించరు. కానీ వైఫల్యాలను మాత్రం ఎత్తిచూపుతారంతా' అని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) డిప్యూటీ గవర్నర్లలో ఒకరైన స్వామినాథన్ జే ఒకింత నిరాశతో వ్యాఖ్యానించారు. 'సెంట్రల్ బ్యాంకింగ్ ఎట్ క్రాస్ రోడ్స్' అంశంపై జరిగిన ఆర్బీఐ@90 ఉన్నతస్థాయి సదస్సులో స్వామినాథన్ మాట్లాడారు. గడిచిన కొన్నేండ్లలో బ్యాంకింగ్ రంగంలో, దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిలో సెంట్రల్ బ్యాంకుల పాత్ర ఎంతో పెరిగిందన్నారు. నియంత్రణ, పర్యవేక్షణ, ద్రవ్యవిధానాలతో ఆర్థిక వ్యవస్థను సెంట్రల్ బ్యాంకులే సుస్థిరం చేస్తున్నాయని చెప్పారు. ఆర్థిక రంగమే దేశానికి వెన్నెముకని, అలాంటి కీలక రంగాన్ని రకరకాల సాధనాలతో వివిధ ముప్పుల నుంచి రక్షించేది సెంట్రల్ బ్యాంకులేనని పేర్కొన్నారు. అయినప్పటికీ ఎంత శ్రమించినా సంక్షోభం సమయాల్లో ఏం చేస్తున్నారన్న ప్రశ్నలే ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ద్రవ్యోల్బణం 4.5 శాతంగానే..

ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో రిటైల్ ద్రవ్యోల్బణం సగటున 4.5 శాతంగానే నమోదు కావచ్చని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్లలో ఒకరైన మైఖేల్ దేబబ్రత పాత్ర ఆశాభావం కనబర్చారు. వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి కట్టడి చేయాలని ఆర్బీఐ లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. దీనికి 2 శాతం తక్కువ, ఎక్కువలుండవచ్చన్న మినహాయింపులూ ఉన్నాయి. ఈ క్రమంలో గడిచిన 3 నెలలుగా ద్రవ్యోల్బణం రేటు 6 శాతం దిగువనే ఉన్నదని పాత్ర ఈ సదస్సు సందర్భంగా గుర్తుచేశారు. ఈ నేపథ్యంలోనే మొత్తం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం సగటు 4.5 శాతంగా ఉండొచ్చన్న అంచనాను వెలిబుచ్చారు. కాగా, సెప్టెంబర్‌లో 9 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 5.5 శాతంగా నమోదైన సంగతి విదితమే. కూరగాయల ధరలు పెరగడంతో ఆహార ద్రవ్యోల్బణం 9.2 శాతానికి ఎగిసింది.

వడ్డీరేటును తగ్గించిన ఎస్బీఐ

- **నెల ఎంసీఎల్ఆర్‌పై పావు శాతం కోత**

ముంబై, అక్టోబర్ 15: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ తమ మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ల (ఎంసీఎల్ఆర్)లో ఒకదాన్ని సవరించింది. ఒక నెల టెన్యూర్ కలిగిన ఎంసీఎల్ఆర్‌ను 8.20 శాతానికి తగ్గించింది. ఇంతకుముందు ఇది 8.45 శాతంగా ఉండేది. దీంతో పావు శాతం దిగినట్టైంది. మంగళవారం నుంచే కొత్త రేటు అమల్లోకి వస్తుంది. ఫలితంగా ఆయా రుణాలను తీసుకున్న ఎస్బీఐ కస్టమర్లకు లాభించనున్నది.

ప్రస్తుతం ఎస్బీఐ ఎంసీఎల్ఆర్	
టెన్యూర్	వడ్డీరేటు
ఓవర్‌నైట్	8.20%
ఒక నెల	8.20%
3 నెలలు	8.50%
6 నెలలు	8.85%
ఏడాది	8.95%
రెండేండ్లు	9.05%
మూడేండ్లు	9.10%

ఏమిటీ ఎంసీఎల్ఆర్?

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 2016 ఏప్రిల్‌లో ఈ ఎంసీఎల్ఆర్‌ను ప్రవేశపెట్టింది. అంతకుముందు బేస్ రేటు, బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు (బీపీఎల్ఆర్) అమల్లో ఉండేవి. 2016 ఏప్రిల్ తర్వాత రుణాలు తీసుకున్నవారికి ఎంసీఎల్ఆర్ ఆధారంగా వడ్డీరేట్లుంటాయి. అంతకుముందు లోన్లు తీసుకున్నవారికి బేస్ రేటు, బీపీఎల్ఆర్ ఆధారంగానే వడ్డీరేట్లు వర్తిస్తాయి. ఇక బ్యాంకులు ఈ ఎంసీఎల్ఆర్ కంటే తక్కువ వడ్డీరేటుకు రుణాలను ఇవ్వకూడదు. ప్రస్తుతం ఓవర్‌నైట్ దగ్గర్నుంచి మూడేండ్ల దాకా రకరకాల ఎంసీఎల్ఆర్‌లు అమల్లో ఉన్నాయి. ఇప్పుడు ఎస్బీఐ మార్చింది నెల రోజుల ఎంసీఎల్ఆర్‌నే. మిగతా వాటిలో ఏ మార్పూ లేదు. ఎంసీఎల్ఆర్ పెరిగితే లోన్ల ఈఎంఐల భారం కూడా పెరుగుతుందన్న విషయం తెలిసిందే. అలాగే తగ్గితే రుణ వాయిదా చెల్లింపులూ తగ్గుతాయి. కాగా, ఎస్బీఐ బేస్ రేటు 10.40 శాతంగా ఉన్నది. బీపీఎల్ఆర్ 15.15 శాతం. ఇవి సెప్టెంబర్ 15 నుంచి అమల్లో ఉన్నాయి. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈబీఎల్ఆర్) 9.15 శాతంగా ఉన్నది.

పడేసిన బ్లూచిప్ సంస్థలు

ముంబై, అక్టోబర్ 15: దేశీయ స్టాక్ మార్కెట్ల ప్రారంభ లాభాలు ఆవిరైపోయాయి. కార్పొరేట్ సంస్థల నిరాశాజనక ఆర్థిక ఫలితాలకు తోడు ధరల సూచీ రాకెట్ వేగంతో దూసుకుపోవడంతో మదుపరుల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో ప్రారంభంలో భారీగా కొనుగోళ్లు జరిపిన పెట్టుబడిదారులు చివరి గంటలో అమ్మకాలకు పోటెత్తారు. ఫలితంగా సూచీలు నష్టపోయాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 152.93 పాయింట్లు కోల్పోయి 81,820.12 వద్దకు జారుకోగా, మరో సూచీ నిఫ్టీ 70.60 పాయింట్లు పతనం చెంది 25,057.35 వద్ద నిలిచింది. బ్లూచిప్ సంస్థలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫైనాన్స్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు వీటి షేర్లు భారీగా నష్టపోయాయి. వీటికి తోడు టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టెక్ మహీంద్రా, టాటా మోటర్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, మారుతిలు షేర్లు పతనం చెందాయి. కానీ, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి.

బీవోఎం లాభం 1,327 కోట్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికి గాను బ్యాంక్ రూ.1,327 కోట్ల నికర లాభాన్ని గడించింది. వడ్డీల మీద వచ్చే ఆదాయం పెరగడం వల్లనే క్రితంఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.920 కోట్ల లాభంతో పోలిస్తే 44 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.5,736 కోట్ల నుంచి రూ.6,809 కోట్లకు చేరుకున్నట్లు బీవోఎం ఎండీ నిధు సక్సేనా తెలిపారు. నికర వడ్డీ మార్జిన్ 3.88 శాతం నుంచి 3.98 శాతానికి చేరుకున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే బ్యాంక్ రూ.5 వేల కోట్ల నికర లాభాన్ని ఆర్జించగలదనే నమ్మకాన్ని ఆయన వ్యక్తంచేశారు. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.19 శాతం నుంచి 1.84 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.23 శాతం నుంచి 0.20 శాతానికి దిగొచ్చింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.598 కోట్ల నిధులను వెచ్చించింది.

నితిన్‌తో ఎల్లమ్మ?

హీరో నితిన్ ఓ వైవిధ్యమైన కథకు ఓకే చెప్పినట్టు ఫిల్మ్ సర్కిల్స్‌లో ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. ఇప్పటివరకూ లవ్, యాక్షన్ కథలతో అలరించిన నితిన్‌కు ఇది కొత్త జానర్. ఇంతకీ ఆ కథ ఏంటి? దాని పూర్వాపరాలేంటి? అనే విషయానికొస్తే.. 'బలగం'తో ఊహకందని విజయాన్ని అందుకున్న కమెడియన్ వేణు ఎల్దండి.. ఆ చిత్రం తెచ్చిపెట్టిన ఇమేజ్‌ని నిలబెట్టుకునేందుకు, మలి ప్రయత్నంగా ఓ కొత్త కాన్సెప్ట్‌ను ఆవిష్కరించే ప్రయోగాత్మక కథను తయారు చేసుకున్నారట. ఆ కథే 'ఎల్లమ్మ'. ఈ కథను నాని, శర్వానంద్‌లకు కూడా వేణు వినిపించారట. వారికి కథ నచ్చినా, అప్పటికే ఉన్న కమిట్మెంట్స్ వల్ల ఓకే చెప్పలేకపోయారని వినికిడి. చివరకు బంతి నితిన్ కోర్ట్‌లోకి వచ్చి చేరిందట. నితిన్ ఈ కథను ఫస్ట్ సిట్టింగ్‌లోనే ఓకే చేశారని తెలుస్తున్నది. రంగస్థల కళాకారుల నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుందని సమాచారం. దిల్‌రాజు బ్యానర్‌లో సినిమా రూపుదిద్దుకోనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అధికార ప్రకటన త్వరలో రానున్నదట. ఇదే నిజమైతే.. తొలి సినిమా 'దిల్' తర్వాత నితిన్‌తో దిల్‌రాజు చేస్తున్న సినిమా ఇదే అవుతుంది.

సైబర్ క్రైమ్‌కు వ్యతిరేకంగా పోరాడుతా

చిత్రం

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు అంబాసిడర్‌గా అగ్ర కథానాయిక రష్మిక మందన్నను నియమించారు. ఈ విషయాన్ని కేంద్ర హోంశాఖకు చెందిన సైబర్ దోస్త్ విభాగం ప్రకటించింది. ఈ సందర్భంగా రష్మిక మందన్న తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ వీడియోను విడుదల చేసింది. డీప్ ఫేక్ వీడియో వల్ల గతంలో తాను సైబర్ క్రైమ్ బారిన పడ్డానని, అందుకే దానికి వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకున్నానని రష్మిక మందన్న తన పోస్ట్‌లో పేర్కొంది. 'సైబర్ క్రైమ్ గురించి అందరికీ అవగాహన కల్పించడానికి ఇదొక మంచి అవకాశం. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నన్ను ఎంచుకోవడం సంతోషంగా ఉంది. సైబర్ క్రైమ్ పట్ల అవగాహన పెంచడానికి నా శాయశక్తులా ప్రయత్నం చేస్తాను. సైబర్ నేరస్థులు మనల్ని ఎటాక్ చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. మనం ఎప్పుడూ అలర్ట్‌గా ఉంటూ వారి బారి నుంచి రక్షించుకోవాలి. మన దేశాన్ని సైబర్ నేరాల నుంచి కాపాడేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటాను' అని రష్మిక మందన్న తెలిపింది. గతంలో రష్మిక మందన్న డీప్ ఫేక్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభ్యంతరకరంగా ఉన్న ఆ వీడియోపై అన్ని వర్గాల నుంచి ఆగ్రహం వ్యక్తమైంది. ఆ తర్వాత పలువురు సినీ తారలు డీప్‌ఫేక్ వీడియోల బారిన పడ్డారు. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలను చేపడుతున్నది.

ఈసారి డబుల్ ధమాకా?



'ధమాకా'తో వందకోట్ల విజయాన్ని అందుకున్నారు హీరో రవితేజ, దర్శకుడు త్రినాథరావు నక్కిన. ఆ సినిమా తర్వాత వెంటనే నక్కినతో మరో సినిమా చేయాలని రవితేజ భావించారట. కానీ అప్పటికే కమిట్‌మెంట్స్ ఉండటం, నక్కిన కూడా వేరే సినిమాకు ఓకే చెప్పడం.. ఈ కారణాల వల్ల 'ధమాకా'కు వెంటనే వీరి కాంబినేషన్ కుదర్లేదు. ప్రస్తుతం సందీప్‌కిషన్‌తో 'మజాకా' సినిమా చేస్తున్నారు నక్కిన త్రినాథరావు. ఈ సినిమా పూర్తవ్వగానే ఆయన రవితేజ సినిమాని పట్టాలెక్కిస్తారట. ఓ వైపు 'మజాకా' షూటింగ్ చేస్తూనే మరోవైపు తన రైటింగ్ టీమ్‌తో రవితేజ సినిమా స్క్రిప్ట్ వర్క్‌ని పూర్తి చేసేస్తున్నారట నక్కిన. నిజానికి 'ధమాకా' నిర్మాణంలో ఉన్నప్పుడే రవితేజకు ఓ కథ చెప్పి ఆయన ఓకే చేయించుకున్నారట. ప్రస్తుతం రవితేజ సితార ఎంటర్టైన్మెంట్స్‌కి ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల కానుంది. ఆ సినిమా తర్వాత నక్కిన త్రినాథరావు సినిమా ఉంటుందని ఫిల్మ్ వర్గాల సమాచారం. ఇదే నిజమైతే ఈ సారి అభిమానులకు డబుల్ ధమాకా ఖాయం.

వయొలెన్స్ విత్ విజన్

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మట్కా'. కరుణ కుమార్ దర్శకుడు. చిత్రీకరణ పూర్తయింది. నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచార పర్వంలో వేగాన్ని పెంచారు. మంగళవారం 30డేస్ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'వయొలెన్స్ విత్ విజన్' అనే క్యాప్షన్‌తో ఉన్న ఈ పోస్టర్‌లో వరుణ్‌తేజ్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం దేశంలో సంచలనం సృష్టించిన యథార్థ ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, వరుణ్‌తేజ్ నాలుగు గెటప్స్‌లో కనిపిస్తారని, ఓ సాధారణ యువకుడు అత్యంత బలమైన శక్తిగా ఎదిగిన వైనాన్ని ఈ సినిమాలో చూపిస్తున్నామని మేకర్స్ తెలిపారు. నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి, నవీన్‌చంద్ర, అజయ్‌ఘోష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఏ.కిషోర్ కుమార్, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, నిర్మాతలు: విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కరుణ కుమార్.

థ్రిల్లింగ్ యాక్షన్ బఖీర



'ఉగ్రం'ఫేం శ్రీమురళి నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ ''బఖీరా'. స్టార్ డైరెక్టర్ ప్రశాంత్‌నీల్ కథ అందించిన ఈ చిత్రానికి డాక్టర్ సూరి దర్శకుడు. ప్రతిష్టాత్మక హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఈ సినిమా ఫస్ట్ సింగిల్‌ని ఈ నెల 17న మేకర్స్ విడుదల చేయనున్నారు. థ్రిల్లింగ్ యాక్షన్ ఎలిమెంట్స్, ఆకట్టుకునే పెర్ఫార్మెన్స్, అద్భుతమైన విజువల్స్ ఈ చిత్రానికి హైలైట్‌గా నిలువనున్నాయని, కన్నడంలోనే కాక, తెలుగులోనూ ఈ చిత్రం ఓ ల్యాండ్‌మార్క్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఏషియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్ ఎల్ఎల్పీ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నది. రుక్మిణి వసంత్, ప్రకాశ్‌రాజ్, రంగాయణ రఘు, అచ్యుత్‌కుమార్, గరుడరామ్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ఏజే శెట్టి, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్.

షాక్ అయ్యేలా ఉంటుంది

''వీక్షణం'లో సరదాగా ఉండే కుర్రాడిగా కనిపిస్తా. పక్కోడి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనే కోరిక ఎక్కువగా ఉండే పాత్ర నాది. ఆ మనస్తత్వం వల్ల తను ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు? అనే ప్రశ్నకు సమాధానమే 'వీక్షణం' అని హీరో రామ్ కార్తీక్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన ఈ చిత్రానికి మనోజ్ పల్లేటి దర్శకుడు. పి.పద్మనాభరెడ్డి, అశోక్‌రెడ్డి నిర్మాతలు. ఈ నెల 18న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా రామ్‌కార్తీక్ మంగళవారం విలేకరులతో ముచ్చటించారు. 'ప్రేమకథగా మొదలై థ్రిల్లర్‌గా మారే వైరైటీ సబ్జెక్ట్ ఇది. ఇలాంటి సినిమా చేయడం ఇదే ప్రథమం. దర్శకుడు మనోజ్ స్క్రిప్ట్ విషయంలో ఎక్కువ సమయం తీసుకున్నారు. స్క్రీన్‌ప్లే ఈ చిత్రానికి హైలైట్. ప్రీ క్లైమాక్స్ అందరూ షాక్ అయ్యేలా ఉంటుంది. భయపెడుతూనే దాన్ని ఎలా అధిగమించాలో తెలిపే సినిమా ఇది' అని చెప్పారు.

అన్యాయాలపై 'ఉగ్రావతారం'

కన్నడ నటుడు ఉపేంద్ర సతీమణి ప్రియాంక ఉపేంద్ర ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఉగ్రావతారం'. గురుమూర్తి దర్శకత్వంలో ఎస్.జి.సతీష్ నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా ట్రైలర్‌ను నిర్మాత రాజ్ కందుకూరి లాంచ్ చేశారు. కరాటే రాజు, సత్య ప్రకాష్ పాటను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రియాంక ఉపేంద్ర మాట్లాడుతూ 'నాకు హైదరాబాద్‌తో ఎంతో అనుబంధం ఉంది. ఉపేంద్రగారిని తొలిసారి ఇక్కడే చూశాను. హైదరాబాద్‌ను నా లక్కీ సిటీగా భావిస్తాను. నా కెరీర్‌లో తొలి యాక్షన్ ఫిల్మ్ ఇది' అని చెప్పింది. సమాజంలో జరిగే అన్యాయాలను, అక్రమాలను ధైర్యవంతురాలైన యువతి ఎలా ఎదిరించింది? కాళీమాతలా దుష్టశిక్షణ ఎలా చేసిందన్నదే ఈ చిత్ర ఇతివృత్తమని, చక్కటి సందేశంతో ఆకట్టుకుంటుందని దర్శకుడు గురుమూర్తి తెలిపారు. మహిళా ప్రధాన కథాంశంతో రూపొందించిన ఈ చిత్రాన్ని నవంబర్ 1న విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు.

రక్షకుడి ఆగమనం

సాయిదుర్గతేజ్ కథానాయకుడిగా ఓ ప్రతిష్టాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామా తెరకెక్కుతున్నది. రోహిత్ కేపీ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. 'హను-మాన్'ఫేం కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మాతలు. మంగళవారం సాయిదుర్గతేజ్ పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ 'ఇంట్రూడ్ ఇన్‌టు ది పరల్డ్ ఆఫ్ ఆర్కాడీ' అనే ఎక్సయిటింగ్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియో సినిమా యూనివర్స్‌ని ఆవిష్కరించింది. దుష్టశక్తుల వల్ల చాలాకాలంగా కష్టాలు ఎదుర్కొంటున్న ఓ నేల, రక్షకుని రాకకోసం ఎదురుచూస్తుంటుంది. ఫైనల్‌గా వారి నిరీక్షణ ఫలించినట్టు వీడియో చెబుతున్నది. ఈ సినిమా ద్వారా ఓ అద్భుత ప్రపంచాన్ని దర్శకుడు ఆవిష్కరించనున్నట్టు వీడియో ద్వారా తెలుస్తున్నది. స్టన్నింగ్ సెట్స్, కాంప్లెక్స్ వెపన్స్ తయారీ, పాత్రలకోసం నటీనటుల ట్రాన్స్‌ఫర్మేషన్.. ఇవన్నీ ఈ వీడియోలో చూడొచ్చు. మొత్తంగా ఫైనల్ ఫ్రేమ్స్‌లో సాయిదుర్గతేజ్‌ని ధృఢకాయు